



# కరపత్రం

SINCE 2014

ఆదివారం మార్చి 16 2025 | సంపుటి :0 | సంచిక : 153 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4


# కేసీఆర్ అసెంబ్లీకి వస్తే కృష్ణా జలాలపై చర్చ పెడదాం

## కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సవాల్

- మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు.
- కేసీఆర్ అసెంబ్లీకి వచ్చినప్పుడే కృష్ణా జలాలపై చర్చ పెడదామని అన్నారు.
- తాము తప్పు మాట్లాడినట్లు తేలితే క్షమాపణలు చెప్పేందుకు కూడా సిద్ధమని స్పష్టం చేశారు.





శనివారం అసెంబ్లీలో సీఎం మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా కేసీఆర్‌కు రూ.54.84 లక్షల జీతం ఇచ్చారని.. కానీ ఇప్పటి వరకు కేసీఆర్ రెండు సార్లు మాత్రమే అసెంబ్లీకి వచ్చారని తెలిపారు. రోజా ఇంట్లో కేసీఆర్ రొయ్యల పులుసు తిని.. రాయలసీమను రతనాల సీమ చేస్తామన్నారని గుర్తుచేశారు. ఒక్కసారి రొయ్యల పులుసు పెడితేనే రాయలసీమను రతనాల సీమ చేస్తా అని అన్నారని.. కానీ గుండెల్లో పెట్టుకుని మహబూబ్‌నగర్ ప్రజలు రాజకీయ భిక్షపెడితే గుండెల మీద తంతారా అని, ఎంపీగా గెలిపించిన పాలమూరు ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలోనే సాగర్‌కు సీఆర్‌పీఎఫ్ బలగాలు వచ్చాయని చెప్పుకొచ్చారు. అప్పుడు సైలెంట్‌గా ఉన్న బీఆర్ఎస్.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తప్పుబడుతోందంటూ రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కృష్ణా నీటి విషయంలో రాష్ట్రానికి మరణశాసనం రాశారన్నారు. కేసీఆర్ కేంద్రమంత్రిగా ఉన్నప్పుడే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని పెంచారని గుర్తుచేశారు. కమీషన్ల కోసమే జూరాల నుంచి తీసుకోవాల్సిన నీళ్లను శ్రీశైలం బ్యాక్ వాటర్ ద్వారా తీసుకుంటామన్నది నిజం కాదా అని నిలదీశారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ఉమ్మడి రాష్ట్రంలోనే 20 కి.మీ మేర పూర్తి చేశారని తెలిపారు. కేసీఆర్ పాలనలో ప్రాజెక్ట్ పనులే చేపట్టలేదన్నారు. ఎస్ఎల్‌బీసీ ప్రమాదంపై సానుభూతి చూపించాల్సిన బీఆర్ఎస్ నేతలు పైశాచిక ఆనందం పొందుతున్నారంటూ మండిపడ్డారు. 'మీ ఫ్రేచర్ గురించి ఉన్న ఆలోచన స్టేట్ ఫ్యూచర్ మీద లేదా. బీఆర్ఎస్ ఇప్పుడు మార్చురీలో ఉందని అన్నా.. తప్పేముంది. నేను కేసీఆర్‌ను కించపరిచినట్టు కేటీఆర్, హరీష్ రావు విమర్శిస్తున్నారు. కేసీఆర్ వందేళ్లు జీవించి ప్రతిపక్షంలోనే ఉండాలని కోరుకుంటున్నా' అంటూ సీఎం వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగ స్ఫూర్తితోనే వ్యవస్థలు ఏర్పడ్డాయని సీఎం అన్నారు. 2022 బడ్జెట్ సమావేశాలు గవర్నర్ ప్రసంగం లేకుండానే ప్రారంభించారని గుర్తుచేశారు. గత ప్రభుత్వానికి ప్రజాస్వామ్య విలువలు పాటించలేదని విమర్శించారు. మహిళా గవర్నర్‌ను గత ప్రభుత్వం అవమానించిందన్నారు. 2లో

## భారాస.. సోషల్ మీడియా ద్వారా లబ్ధి పొందాలని చూస్తోంది: మంత్రి సీతక్క



2లో

## డీ లిమిటేషన్ చేస్తే సీట్లు తగ్గుతాయనేది దుష్ప్రచారం మాత్రమే: కిషన్‌రెడ్డి



- అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద దేశవ్యాప్తంగా కేంద్రప్రభుత్వం వివిధ రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. 2లో

## తొలి దశలోనే క్యాన్సర్‌ను గుర్తిస్తే నయం చేసుకోవచ్చు: వెంకయ్య నాయుడు

- రొమ్ము క్యాన్సర్‌పై యూట్యూబ్ వేదికగా నిర్వహించిన అవగాహన కార్యక్రమాన్ని రికార్డు స్థాయిలో వీక్షించిన నేపథ్యంలో కిమ్స్ ఆస్పత్రి రొమ్ము క్యాన్సర్ వైద్య నిపుణులు రఘురాం గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డు 2లో

## బీజేపీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నాం

జాకీ పెట్టిలేపినా బీఆర్ఎస్ లేవదు : బండిసంజయ్



2లో

## కాంగ్రెస్ పాలనలో తెలంగాణకు అన్యాయం



- కాంగ్రెస్ పాలనలో తెలంగాణకు నాటి నుంచి నేటి వరకు అన్యాయమే జరిగిందని, ఇప్పుడు జరుగుతుందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు.
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అసెంబ్లీలో పచ్చి అబద్ధాలు మాట్లాడారని హరీష్‌రావు ధ్వజమెత్తారు.
- కృష్ణా జలాల్లో తెలంగాణకు జరిగిన అన్యాయానికి కారణం కాంగ్రెస్ పార్టీ అని విమర్శించారు.

కాంగ్రెస్ నిర్లక్ష్యం వల్ల 299 టీఎంసీల నీటి పంపకాలు చేశారని చెప్పారు. 299 టీఎంసీల నీటి వినియోగం కంటే ఎక్కువ ప్రాజెక్టులు లేవని తెలిపారు. పదేళ్లు సీఎంగా ఉన్న కేసీఆర్‌చావును సీఎం రేవంత్ రెడ్డి కోరుకున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో హరీష్‌రావు చిట్‌చాట్ చేశారు. 2లో

## బాల్కొండలో రైతులకు రుణమాఫీ కాలేదు : వేముల




- తెలంగాణ అసెంబ్లీలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యుల మధ్య వాడీవేడి చర్చ జరుగుతోంది.
- గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానానికి సంబంధించిన చర్చలో పాల్గొన్న బీఆర్ఎస్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి.. ప్రభుత్వం చెబుతున్నట్టుగా రాష్ట్రంలో ఎక్కడా పూర్తి రుణమాఫీ కాలేదని అన్నారు. 2లో

## గుత్తా సుఖేందర్‌రెడ్డి అసహనం

### తప్పుపట్టిన ఎమ్మెల్సీ కవిత



శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి శనివారం సభలో అసహనం ప్రదర్శించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుపై కోపాన్ని చూపించారు. 'ఏందయ్యా నీ లొల్లి.. రోజూ న్యూసెన్స్ చేస్తున్నావ్..' అంటూ గద్దింపు ధోరణిలో మాట్లాడారు. సాటి సభ్యుల ముందు తాతా మధును అగౌరవపరిచారు. మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తీరును బీఆర్ఎస్ పార్టీ తప్పుపట్టింది. సభలో ఛైర్మన్ సుఖేందర్‌రెడ్డి తమ సభ్యుడిని ఉద్దేశించి న్యూసెన్స్ అనే పదం వాడటం కరెక్టు కాదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. దీనిపై ఆమె మండలిలో మాట్లాడుతూ.. సభలో మా సభ్యుడిని ఉద్దేశించి మీరు న్యూసెన్స్ అనే పదం వాడారని, తాను మీకు చెప్పేందుకు పెద్దదాన్ని కాదని, ఆ పదాన్ని దయచేసి రికార్డుల నుంచి తొలగించాలని కోరారు. కాగా, మండలి ఛైర్మన్ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు మీడియా సమావేశం పెట్టనున్నట్లు తెలిసింది. మీడియా సమావేశం పెట్టి స్పీకర్ తీరును విమర్శించనున్నట్లు సమాచారం.

# సంపాదకీయం

## ఆ దోస్తీ భారత్‌కు మేలు చేసేనా?

ప్రపంచ చరిత్రలో మొట్టమొదటి హక్కుల పత్రం మాగ్నాకార్టా అని విశ్వసిస్తారు. క్రీ.శ. 1215లో ఇంగ్లాండ్ రాజు దాన్ని అంగీకరించారు. ప్రపంచంలో మొట్టమొదటి పార్లమెంటుగా ఐస్‌లాండ్ దేశపు అల్థింగ్ అని భావిస్తారు. క్రీ.శ.1262లో ఈ తొలి పార్లమెంటు నేర్పాటు చేశారు. ప్రథమ ద్విసభీయ శాసన వ్యవస్థ చరిత్ర బ్రిటన్‌లో క్రీ.శ.1341లో ప్రారంభమయింది. ప్రథమ లిఖిత రాజ్యాంగం శాన్‌మరినో రిపబ్లిక్‌ది. క్రీ.శ.1600 సంవత్సరం నుంచి ఇది అమల్లో ఉంది. అధికారాల విభజనకు ప్రేరణ 'స్పిరిట్ ఆఫ్ లాస్'. ఫ్రెంచ్ తాత్వికుడు మోంటెస్క్యూ (1889%-%1775) రాసిన ఈ ఉద్గ్రంథం అమెరికా రాజ్యాంగ నిర్మాతలకు స్ఫూర్తినిచ్చింది. ఒక దేశ న్యాయ అధికారాలను మొట్టమొదట ఒక సుప్రీంకోర్టుకు అధీనం చేసిన దేశం అమెరికా. సెప్టెంబర్ 24, 1789న సమస్త న్యాయ అధికారాలను సుప్రీంకోర్టుకు అప్పగించారు.

రాజ్యాంగబద్ధమైన చరిత్ర ఉన్నతమైన, ప్రశంసనీయమైన పాఠాలు అన్నీ అమెరికా రాజ్యాంగంలో నిర్దిష్టంగా పొందుపరిచారు. భారత రాజ్యాంగ నిర్మాతలతో సహా అనేక దేశాలలో అమెరికా రాజ్యాంగాన్ని అనుకరించారు. యుద్ధాలు, పేదరికం, వ్యాధుల ముప్పుకు ఆస్కారం లేని కొత్త ప్రపంచ వ్యవస్థను నిర్మించేందుకు అమెరికా నాయకత్వంలో స్వేచ్ఛాయుత, ప్రజాస్వామిక దేశాలు మానవాళికి వాగ్దానం చేశాయి. ఆ లక్ష్య పరిపూర్తిలో అవి చాలవరకు సఫలమయ్యాయి.

ఈ నేపథ్యంలో గత మూడు సంవత్సరాలలో, ముఖ్యంగా జనవరి 20, 2025 నుంచి సంభవించిన, సంభవిస్తున్న పరిణామాలు ప్రపంచ ప్రజలను దిగ్భ్రాంతి పరిచాయి. భావావేశాలకు లోను చేస్తున్నాయి. సహేతుకమైన ప్రతిస్పందనలవి. ఎందుకంటే గత మూడేళ్ల పరిణామాలు ప్రపంచానికి ఎనలేని ముప్పు కలిగించేవిగా ఉన్నాయి. స్వార్థపరత్వం రాజ్యమేలే, నిరంకుశాధికార వ్యవస్థలు ప్రబలిపోయేందుకు ఆ పరిణామాలు దోహదం చేసేవిగా ఉన్నాయి. అమెరికా సంయుక్త రాష్ట్రాల అధ్యక్ష పదవి మహా శక్తిమంతమైనది. నిర్దిష్టమైన అధికారాలు, ప్రత్యేక అధికారాలతో పాటు అనిర్ణీత అధికారాలు కూడా ఆ పదవికి ఉన్నాయి. పైగా అమెరికా ప్రపంచ అగ్రగామి సంపన్న దేశం అనే వాస్తవం ఆ పదవికి మరింత ప్రాధాన్యాన్ని కల్పిస్తుంది. ఆ అధికారాలను ఉపయోగిచుకుని 19వ శతాబ్దిలో అధ్యక్షుడు విలియం మెక్ కిల్లే అమెరికాను భౌగోళికంగా విస్తరింపచేశాడు. ప్యూరిటో రికో, గువామ్, ఫిలిప్పీన్స్, హవాయిలను అమెరికాకు అనుసంధించాడు. ఇరవయో శతాబ్దిలో ఉడ్రో విల్సన్, ఫ్రాంక్లిన్ డి రూజ్వెల్ట్ లు వాక్ స్వాతంత్ర్యాన్ని అణచివేశారు. తమ కార్యనిర్వాహక అధికారాలను ఉపయోగించి విదేశీయులను నిర్బంధంలోకి తీసుకున్నారు. అలా అరెస్ట్ చేసిన వారిని బలవంతంగా స్వదేశాలకు పంపించివేశారు. రాజకీయ అసమ్మతివాదులను సైతం తీవ్రంగా అణచివేశారు. 21వ శతాబ్దిలో బరాక్ ఒబామా అమెరికా కాంగ్రెస్ అనుమతి లేకుండానే లిబియాలో యుద్ధాన్ని ప్రారంభించాడు. యుద్ధ అధికారాల చట్టం%-%1973 కింద ఆయన స్వతంత్ర నిర్ణయం తీసుకున్నాడు ఇతర అధ్యక్షులు సైతం తమ పదవీ అధికారాల పరిమితులను తమ స్వతంత్ర నిర్ణయాలతో పరీక్షించారు. రాజ్యాంగ విరుద్ధమైన నిర్ణయాలు తీసుకోవడం, చర్యలు చేపడుతూనే కాంగ్రెస్ అభిశంసన నుంచి తప్పించుకోగలిగారు. అమెరికా అధ్యక్ష పదవి అధికారాలను మరే అధ్యక్షుడు కంటే ఎక్కువగా ఉపయోగించుకున్నది 47వ అధ్యక్షుడు డోనాల్డ్ జె ట్రంప్. గత ఎనిమిది దశాబ్దాలలో అమెరికా ఎన్నిమార్లు తన మామూలు విధానాలకు భిన్నంగా వ్యవహరించినప్పటికీ, ఎన్నిసార్లు దుస్సాహసాలకు పాల్పడినప్పటికీ స్వేచ్ఛాయుత, ప్రజాస్వామిక దేశాల నాయకుడుగా గౌరవాదరాలు పొందింది. సకల దేశాల ప్రజలు, ప్రభుత్వాలు ప్రపంచ వ్యవహారాలలో అమెరికా అధ్యక్షుడి మాటను, ఆమోదించినా, ఆమోదించకపోయినా, ప్రాధాన్యమిచ్చారు. ప్రపంచ వ్యవస్థ భద్రతకు హామీపడ్డ దేశం అమెరికా. ప్రపంచ శాంతి సంరక్షణకు, విద్యావ్యాసంగాల వికాసానికి, ఆరోగ్య భద్రతకు, మానవ హక్కుల పరిరక్షణకు అమెరికా ప్రభుత్వం ఎన్నో అంతర్జాతీయ సంస్థలను నెలకొల్పి, నిర్వహించింది. అయితే డోనాల్డ్ ట్రంప్ మళ్లీ అధికారానికి వచ్చిన రెండు నెలల లోగానే అమెరికా ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి వైదొలిగిందిబీ ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల సమితికి, యునైటెడ్ నేషన్స్ రిలీఫ్ అండ్ వర్క్స్ ఏజెన్సీకి నిధులు నిలిపివేస్తామని, అసలు ఆ సంస్థ నుంచి ఉపసంహరించుకుంటామని అమెరికా బెదిరిస్తోంది. ట్రంప్ ఆదేశాల మేరకు ఇప్పటికే యుఎస్ ఎయిడ్‌ను మూసివేశారు. ఫలితంగా ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో సహాయ కార్యక్రమాల అమలు పూర్తిగా నిలిచి పోయింది. అలాగే నాటో నుంచి కూడా వైదొలుగుతామని, యూరోపియన్ మిత్ర దేశాలకు గతంలో వలే ఎటువంటి సహాయ సహకారాలు అందించే ప్రసక్తి లేదని ట్రంప్ మహాశయుడే స్వయంగా ప్రకటించాడు. డోనాల్డ్ ట్రంప్ విచిత్రమైన వ్యక్తి. స్నేహితుడు శత్రువు అయిపోయాడు (ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ), శత్రువు మిత్రుడు కావచ్చు (రష్యా అధ్యక్షుడు పుతిన్). పొరుగు దేశం సువిశాల కెనడాను అమెరికాలో 51వ రాష్ట్రంగా ఉండాలని ఆయన ప్రగాఢంగా అభిలషిస్తున్నాడు. అమెరికాలో చేరమని గ్రీన్ ల్యాండ్‌కు బహిరంగంగా ఆహ్వానం పలికాడు. అంతటితో ఆగకుండా ఏదో ఒక విధంగా గ్రీన్ ల్యాండ్‌ను తమ దేశంలో కలుపుకుంటామని' నర్మగర్భితమైన హెచ్చరికను ట్రంప్ జారీ చేశాడు. డోనాల్డ్ ట్రంప్‌కు అమెరికా ప్రయోజనాలే ముఖ్యం. శత్రువు (చైనా), మిత్రుడు (భారత్) మధ్య ఎటువంటి భేదాన్ని చూపరు. 'నేను నా జీవితమంతా ఎన్నో ఒప్పందాలు చేసుకున్నాను' అని ఆయన ఘనంగా చెప్పుకున్నారు. ఉక్రెయిన్ అధ్యక్షుడిని చర్చలకు ఆహ్వానించి, అవమానపరిచి, పంపించివేసిన ట్రంప్ 'ఒప్పందానికి సిద్ధమయినప్పుడే మళ్లీ వైట్‌హౌజ్‌కు రండి' అని జెలెన్ స్కీని ఆహ్వానించాడు బహుశా, ఉక్రెయిన్‌లో లభించే అరుదైన ఖనిజ సంపద విషయమై ఒప్పందం కుదుర్చుకునేందుకు కాబోలు! రష్యాతో యుద్ధంలో సహాయపడుతున్నందుకు ఉక్రెయిన్ తన ఖనిజ సంపదను అమెరికాకు ఇవ్వాలన్నది ట్రంప్ వాదన మరి.

రాజనీతిజ్ఞతను వ్యాపార లావాదేవీగా మార్చి వేసిన ఘనత ట్రంప్‌దే అనడంలో సందేహం లేదు. అత్యంత శక్తిమంతమైన పదవిలో ఉన్న ఇటువంటి వ్యక్తితో ప్రపంచం ఏమవనున్నది? ట్రంప్ విధానాల పర్యవసానాలు మన దేశం విషయంలో ఎలా ఉంటాయి? ప్రపంచ స్థాయిలో చూస్తే నిరంకుశ పాలకులు అయిన ట్రంప్, పుతిన్, క్సి జిన్‌పింగ్‌లు తమ ప్రయోజనాలకు ఏకమయ్యే అవకాశమున్నది. వారు తాము కోరుకుంటున్న ఇరుగు పొరుగు దేశాలను స్వాధీనం చేసుకునేందుకు తప్పక ప్రయత్నిస్తారు. ట్రంప్ ఇప్పటికే పనామా కాలువ, కెనడా, గ్రీన్‌ల్యాండ్, గాజాపై కన్ను వేశారుబీ ఇప్పటికే క్రిమియా, అబ్ఖాజియా, దక్షిణ ఒస్సెటియాను కలిపివేసుకున్న రష్యా ఉక్రెయిన్‌ను కైవశం చేసుకోవడానికే యుద్ధానికి దిగింది. బహుశా జార్జియాను కలిపివేసుకోవడానికి కూడా ప్రయత్నించవచ్చు. ఇక చైనా టిబెట్, హాంకాంగ్‌లను బలవంతంగా కలిపివేసుకుని ఇప్పుడు తైవాన్, భారత్‌లోని కొన్ని హిమాలయ ప్రాంతాలు, దక్షిణ చైనా సముద్రంలోని దీవులను కలిపివేసుకోవాలని ప్రగాఢంగా ఆకాంక్షిస్తోంది.

## భారాస.. సోషల్ మీడియా ద్వారా లబ్ధి పొందాలని చూస్తోంది: మంత్రి సీతక్క

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: భారాస.. సోషల్ మీడియా ద్వారా లబ్ధి పొందాలని చూస్తోందని మంత్రి సీతక్క ఆరోపించారు. "సోషల్ మీడియా ద్వారా నేను కూడా చాలా ఇబ్బంది పడ్డాను. నాపై పెట్టిన పోస్టులకు మానసికంగా ధైర్యం కోల్పోయా. నిజాయతీగా పనిచేసే మహిళల ధైర్యాన్ని సోషల్ మీడియా దెబ్బతీస్తుంది. ఒక మంచి పని చేసి సోషల్ మీడియాలో పోస్టు చేస్తే దాన్ని స్ఫూర్తిగా తీసుకొని మరో పది మంది సాయం చేసేలా ఉండాలి. మార్చురీ అన్న పదం ఒక వ్యక్తిని ఉద్దేశించి అన్నది కాదు.. ఒక పార్టీని అన్నారు.

రాజకీయంగా ఎదుర్కోవాలి.. కానీ, సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేయడమేంటి? బాడీ షేమింగ్ చేయకూడదు. సోషల్ మీడియాకి హద్దు ఉండాలి. అబద్ధాలకి బ్రాండ్ అంబాసిడర్‌గా భారాస మారింది. ఒక అబద్ధాన్ని వంద సార్లు చెబితే నిజం అవుతుందని ఆ పార్టీ నమ్ముతోంది. సోషల్ మీడియాలో భాజపా, భారాస అన్నదమ్ములు. సోషల్ మీడియాలో పెట్టే పోస్టుల విషయంలో కట్టడికి ఒక చట్టం తీసుకు రావాలి" అని మంత్రి సీతక్క అన్నారు.

## డీ లిమిటేషన్ చేస్తే సీట్లు తగ్గుతాయనేది దుష్ప్రచారం మాత్రమే: కిషన్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద దేశవ్యాప్తంగా కేంద్రప్రభుత్వం వివిధ రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్‌తో కలిసి బేగంపేట రైల్వేస్టేషన్‌ను సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు. రైల్వేలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయన్నారు. త్వరలోనే బేగంపేట రైల్వే స్టేషన్‌ను ప్రారంభిస్తామని చెప్పారు. మరో పది శాతం పనులు పూర్తికావాల్సి ఉందని వివరించారు. విమానాశ్రయాల తరహాలో రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు.

""రూ.26.55 కోట్లతో మొదటివిడత పనులు జరుగుతున్నాయి. మరో రూ.12 కోట్లతో రెండోవిడత పనులు పూర్తి చేస్తాం. ప్రయాణికులకు ఇబ్బందిలేకుండా దశలవారీగా అభివృద్ధి పనులను పూర్తి చేస్తున్నాం. ఒకప్పుడు రైల్వేస్టేషన్‌కు వస్తే ముక్కు మూసుకొని రావాల్సిన పరిస్థితి ఉండేది. ప్రధాని మోదీ స్వచ్ఛభారత్ ద్వారా స్వచ్ఛ రైల్వేస్టేషన్ పేరుతో వినూత్న మార్పులను తీసుకొచ్చారు. చర్లపల్లి రైల్వే స్టేషన్‌ని కూడా అధునాతనంగా నిర్మించుకొని ప్రారంభించుకున్నాం. బేగంపేట రైల్వేస్టేషన్‌లో అందరూ మహిళలే ఉద్యోగులు ఉండేలా చూస్తాం.

త్రిభాషా విధానం దేశంలో కొత్తదేమీ కాదు. కేంద్ర ప్రభుత్వం బలవంతంగా తమపై హిందీ రుద్దుతోందని దుష్ప్రచారం చేస్తున్నారు. ఏ ఒక్కరిపై కూడా బలవంతంగా హిందీని రుద్దే ప్రయత్నం చేయలేదు. ఏ భాష కావాలంటే అందులో చదువుకునే అవకాశం ఉంది. తమిళ భాషలో తీసిన సినిమాలు హిందీలో డబ్ చేసి రూ.కోట్లు లాభాలను నిర్మాతలు పొందుతున్నారు. వాళ్లకా లాభాలు ఎలా వస్తున్నాయి? భాష పేరుతో దేశాన్ని విభజించాలని చూడటం సరికాదు. ముఖ్యమంత్రిగా స్టాలిన్ ఏం చేశాడో చెప్పి తమిళనాడు ప్రజల్ని ఓట్లు అడగాలి. ఆయనేం చేయలేదు కాబట్టే భాష పేరు మీద దుష్ప్రచారం చేస్తూ ఎన్నికలు దాటేయాలని చూస్తున్నారు. పునర్విభజనకు సంబంధించి 2009లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటి విధానాలే ఇప్పటికీ కొనసాగుతున్నాయి. పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజనపై కొత్త విధానం రాలేదు. డీ లిమిటేషన్ చేస్తే సీట్లు తగ్గుతాయనేది దుష్ప్రచారం మాత్రమే" అని కిషన్‌రెడ్డి చెప్పారు.

## తొలి దశలోనే క్యాన్సర్‌ను గుర్తిస్తే నయం చేసుకోవచ్చు: వెంకయ్య నాయుడు

మొదటిపేజీ తరువాయి

రెజిమెంటల్ బజార్ : రొమ్ము క్యాన్సర్‌పై యూట్యూబ్ వేదికగా నిర్వహించిన అవగాహన కార్యక్రమాన్ని రికార్డు స్థాయిలో వీక్షించిన నేపథ్యంలో కిమ్స్ ఆస్పత్రి రొమ్ము క్యాన్సర్ వైద్య నిపుణులు రఘురాం గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డు సాధించారు. ఈ సందర్భంగా ఆయనను మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అభినందించారు. కిమ్స్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వెంకయ్య హాజరయ్యారు. ఆయన చేతుల మీదుగా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ ప్రశంస పత్రాన్ని రఘురాం అందుకున్నారు. రొమ్ము క్యాన్సర్ పట్ల అవగాహన కల్పించడంలో కిమ్స్ ఆస్పత్రి వైద్యులు చేస్తున్న కృషి అభినందనీయమని వెంకయ్యనాయుడు ప్రశంసించారు.

"తొలి దశలోనే ఈ క్యాన్సర్‌ను గుర్తిస్తే అధునాతన వైద్య పద్ధతులను అనుసరించి నయం చేయవచ్చు. అందుకోసం ప్రజలకు అవగాహన కల్పించడం అత్యంత అవసరం. ఏకకాలంలో వందలాది మందికి అవగాహన కల్పించడంలో రఘురాం పాత్ర గొప్పది. ప్రస్తుత సమాజంలో వినోదానికే వాడుతున్న సామాజిక మాధ్యమాలను వేదికగా చేసుకుని మహిళలు ఎదుర్కొనే ఆరోగ్య సమస్యల పట్ల అవగాహన కల్పించడం శుభ పరిణామం. మారుమూల ప్రాంతాల ప్రజలకు సైతం వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలన్న అభిరుచి కలిగి ఉండడం దేశానికి శ్రేయస్కరం. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు ఆరోగ్యం కాపాడుకోవాలంటే శారీరక దారుఢ్యం, మానసిక ప్రశాంతత, ఆహార అలవాట్లను నియంత్రణలో ఉంచుకోవాలి. అప్పుడే వ్యాధుల బారిన పడే అవకాశం తక్కువగా ఉంటుంది. భారత ప్రజలు మాతృభాషకు తొలి ప్రాధాన్యం ఇవ్వాల్సిన బాధ్యత ఉంది" అని వెంకయ్యనాయుడు అన్నారు.

గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకోవడంపై డాక్టర్ రఘురాం ఆనందం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మౌంట్ అబూలో బ్రహ్మకుమారిలతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించగా.. దాన్ని 11,000 మంది యూట్యూబ్ వేదికగా చూశారని తెలిపారు. ఉషా లక్ష్మి రొమ్ము క్యాన్సర్ సెంటర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొలి దశలోనే ఈ వ్యాధిని గుర్తిస్తే క్యాన్సర్ ముప్పు నుంచి బయటపడొచ్చని అన్నారు. 40 ఏళ్లు దాటిన మహిళలంతా రొమ్ము క్యాన్సర్ బారిన పడకుండా ఉండాలంటే స్క్రీనింగ్ చేసుకోవాలని సూచించారు. తన తల్లి కూడా ఈ వ్యాధితో బాధ పడినట్లు తెలిపారు. ఆమె స్ఫూర్తితోనే ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తన వంతుగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ ఆసుపత్రుల ఎండీ భాస్కర్ రావు, మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్, వరల్డ్ రికార్డు ప్రతినిధి రిషి నాథ్ తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ మీద అక్కసుతో సరైన ఛాంబర్ కూడా కేటాయించలేదు: ప్రశాంత్‌రెడ్డి



హైదరాబాద్: కేసీఆర్ మీద అక్కసుతో ఆయనకు సరైన ఛాంబర్ కూడా కేటాయించలేదని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. "ప్రతిపక్ష నాయకుడు సూచించిన వారినే పీఏసీ ఛైర్మన్‌గా నియమించడం ఆనవాయితీ. ఈ విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆనవాయితీని తుంగలో తొక్కింది. ప్రతిపక్ష నేతను సంప్రదించకుండానే పీఏసీ ఛైర్మన్‌ను నియమించారు.

కేసీఆర్ 14 ఏళ్లు పోరాటం చేసి తెలంగాణ సాధించారు. పదేళ్లు సీఎంగా పనిచేసి తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి జుగుప్సాకరంగా మాట్లాడి తెలంగాణ పరువు తీశారు. భాజపా జపం చేస్తూ.. పొగుడుతూ, కేసీఆర్‌ను మాత్రం అగౌరవపరిచారు. ప్రజాస్వామ్యంలో సీఎంకు ఎంత ప్రాధాన్యత ఉంటుందో.. ప్రతిపక్ష నేతకు అంతే ప్రాధాన్యత ఉంటుంది" అని ప్రశాంత్‌రెడ్డి అన్నారు.

## కేసీఆర్ అసెంబ్లీకి వస్తే కృష్ణా జలాలపై చర్చ పెడదాం

మొదటిపేజీ తరువాయి

గవర్నర్ ప్రసంగం గాంధీభవన్‌లో కార్యకర్త ప్రసంగంలా ఉందని కొందరు తమ అజ్ఞానాన్ని బయట పెట్టుకున్నారని మండిపడ్డారు. గవర్నర్ ప్రసంగం కాంగ్రెస్ విధానాలకు వ్యతిరేకంగా ఉండదని.. తమ కాంగ్రెస్ ప్రభుత్వం.. ప్రజాపాలన అని స్పష్టం చేశారు. ప్రభుత్వాలు వ్యక్తుల ఆస్తి కాదన్నారు. బలహీనవర్గాలకు చెందిన మహిళా గవర్నర్‌ను బీఆర్ఎస్ ప్రభుత్వం అవహేళన చేసిందంటూ వ్యాఖ్యలు చేశారు సీఎం. అయితే సీఎం మాట్లాడుతున్న సమయంలోనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభ నుంచి వాకౌట్ చేశారు. కేసీఆర్‌పై సీఎం వ్యాఖ్యలకు నిరసనగా వాకౌట్ చేశారు. కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సీఎం ప్రసంగాన్ని వినబోమని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు. దీనిపై సీఎం స్పందిస్తూ.. బీఆర్ఎస్ నేతలు ఇలాగే వ్యవహరిస్తే రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో సున్నానే మిగులుతుందంటూ ఎద్దేవా చేశారు. కేబినెట్ ఆమోదం పొందిన అంశాలే గవర్నర్ ప్రసంగంలో ఉంటాయని తెలిపారు. కనీస అవగాహన లేకుండా విపక్ష నేతలు మాట్లాడుతున్నారన్నారు. ప్రజల కోసం విపక్షాలు సూచనలు చేస్తే స్వీకరిస్తామన్నారు. గత ప్రభుత్వం కేబినెట్ ఆమోదం లేకుండానే గవర్నర్ ప్రసంగం ఉందా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌కు గవర్నర్ వ్యవస్థపై నమ్మకం లేదన్నారు. అప్పులతోనే రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. మొదటి ఏడాదిలోనే రూ.20 వేల కోట్లకుపైగా రుణమాఫీ చేశామన్నారు. మార్చి 31 నాటికి రైతులందరికీ రైతు భరోసా ఇస్తామని స్పష్టం చేశారు. భూమి లేని రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇస్తున్నామన్నారు. రైతుల నుంచి ధాన్యం మొత్తాన్ని కొనుగోలు చేస్తామని వెల్లడించారు. సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇచ్చామన్నారు. గతంలో ఎక్కడ పంట పండినా కాళేశ్వరం వల్లే అన్నారని.. కానీ కాళేశ్వరం నీళ్లు లేకున్నా రికార్డ్ స్థాయిలో ధాన్యం పండిందని తెలిపారు. గత ప్రభుత్వం మిల్లర్లతో కుమ్మక్కై రైతులకు అన్యాయం చేసిందన్నారు. వరి వేసుకుంటే ఉరి వేసుకున్నట్టే అని కేసీఆర్ అనలేదా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు.

## కాంగ్రెస్ పాలనలో తెలంగాణకు అన్యాయం

మొదటిపేజీ తరువాయి

తెలంగాణ కోసం ప్రాణాలు ఫణంగా పెట్టిన కేసీఆర్ చావు కోరుకోవడం తప్పు.. అందుకే అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి స్పీచ్‌ను బహిష్కరించామని హరీష్‌రావు అన్నారు. తెలంగాణలో ప్రాజెక్టులు కట్టలేదు కాబట్టి..299 టీఎంసీల నీరు తాత్కాలికంగా కేటాయించారని హరీష్‌రావు గుర్తుచేశారు. ప్రాజెక్టులు కట్టని పాపం కాంగ్రెస్‌దేనని విమర్శించారు. ఢిల్లీకి రాహుల్ బొజ్జా, ఈఎన్సీ అనిల్ వెళ్లారని.. నీటి కేటాయింపులపై చర్చించారని చెప్పారు. తెలంగాణకు అన్యాయం జరిగేలా ఎందుకు ఒప్పుకుని వచ్చారని హరీష్‌రావు ప్రశ్నించారు. పోతిరెడ్డిపాడు కోసం పీజేఆర్ కొట్లాడారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి పదవుల కోసం పెదవులు మూసుకున్నారని ఆరోపణలు చేశారు. తెలంగాణ కాంగ్రెస్ నాయకులు ఒక్క రోజు కూడా వ్యతిరేకించలేదని.. 40 రోజులు అసెంబ్లీని స్థంభింపజేశామని గుర్తుచేశారు. తెలంగాణ కోసం తాము ఆ రోజు ఆరు మంత్రి పదవులు వదులుకున్నామని చెప్పారు. మంత్రి ఉత్తమ్ ఏపీ సీఎం చంద్రబాబు దగ్గరకు వెళ్లి భోజనం చేసి వచ్చారు.. కృష్ణ నీటిలో తెలంగాణకు అన్యాయం చేశారని హరీష్‌రావు మండిపడ్డారు. ఆ తర్వాత ఉత్తమ్ కుమార్ రెడ్డి శ్రీశైలం ఖాళీ చేసే లాగా ద్రోహం చేశారని హరీష్‌రావు విమర్శించారు. సెక్షన్ 3ను సాధించింది కేసీఆర్ అని గుర్తుచేశారు. 573 టీఎంసీల నీళ్లు సెక్షన్ 3 ద్వారా తెచ్చింది తామేనని చెప్పారు. ద్రోహ చరిత్ర ఉత్తమ్‌ది.. త్యాగ చరిత్ర బీఆర్ఎస్‌ది అని ఉద్ఘాటించారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుపై స్టే తెచ్చింది బీఆర్ఎస్ అని తెలిపారు. నల్గొండలో పంటలు ఎండిపోవడానికి కాంగ్రెస్ కారణం.. కృష్ణ నీళ్లను సముద్రంలో కలిపారని ధ్వజమెత్తారు. కేసీఆర్ సీతారామ ప్రాజెక్టు కట్టడం వల్ల ఖమ్మం జిల్లాకు నీళ్లు ఇవ్వగలిగామని గుర్తుచేశారు. హుజూర్ నగర్‌ను ముంపునకు గురి చేసి ఆంధ్రాలో మూడో పంటకు నీళ్లు ఇచ్చారని ఆరోపించారు. పులిచింతల నిర్వాసితులకు వందల కోట్ల రూపాయలు ఇచ్చి కాపాడుకున్నామని హరీష్‌రావు పేర్కొన్నారు.

## బీజేపీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నాం

మొదటిపేజీ తరువాయి



రాష్ట్రంలో పాలన అదుపు తప్పిదని.. కాంగ్రెస్‌కు పాలన చేతకావడం లేదని కేంద్ర మంత్రి బండిసంజయ్ అన్నారు. బీజేపీ నేత రాజాసింగ్ కామెంట్స్‌పై బండి సంజయ్ స్పందించారు. బీజేపీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు పార్టీల మధ్య రహస్య సమావేశాలు జరిగి ఉండవచ్చని చెప్పారు. రాజాసింగ్ చేసిన కామెంట్లను తాను చూడలేదని బండి సంజయ్ అన్నారు. శనివారం కరీంనగర్‌లో బండి సంజయ్ పర్యటించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడారు. బీజేపీకి ఎవరితోనూ రహస్య ఎజెండాలు, సమావేశాలు ఉండవని బండి సంజయ్ స్పష్టం చేశారు. ఆరు గ్యారంటీలు.. బీజేపీని అడిగే ఇచ్చారా అని ప్రశ్నించారు. పంటలు ఎండుతుంటే కాంగ్రెస్‌కు పట్టదా అని నిలదీశారు. బీఆర్ఎస్‌ను జాకీ పెట్టి లేపినా ఇక లేవదని విమర్శించారు. డిలీమిటేషన్‌పై ఎలాంటి నిర్ణయం జరగలేదని అన్నారు. ఒక వర్గం, ప్రాంతం కోసం కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోదని తేల్చిచెప్పారు. కేంద్రం ప్రకటన చేయకముందే ప్రతిపక్షాలు హడావుడి చేస్తున్నాయని అన్నారు. హైదరాబాద్ డ్రగ్స్‌కు అడ్డాగా మారిందని బండి సంజయ్ ఆరోపించారు.

## బాల్కొండలో రైతులకు రుణమాఫీ కాలేదు : వేముల

మొదటిపేజీ తరువాయి

దీనికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందిస్తూ తాము పూర్తిస్థాయిలో రుణమాఫీ చేశామని, లెక్కలతో సహా వెల్లడిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా బాల్కొండ నియోజకవర్గం అంశాన్ని భట్టి ప్రస్తావించారు. బాల్కొండలో కూడా పూర్తిస్థాయిలో రుణమాఫీ అయ్యిందన్నారు. దీనిపై బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. తన నియోకవర్గంలో మొత్తం 51 వేల మంది రైతులకు రుణమాఫీ జరగాల్సి ఉంటే కేవలం 20 వేల మందికే రుణాలు మాఫీ చేశారని చెప్పారు. ఇంకా 31 వేల మందికి రుణమాఫీ కాలేదని అన్నారు. అంతేగాక బీఆర్ఎస్ హయాంలో రెండు విడతల్లో చేసిన రుణమాఫీ కంటే ఇప్పటి కాంగ్రెస్ సర్కారు చేసిన రుణమాఫీ చాలా తక్కువగా ఉందని విమర్శించారు. నేను చెప్పింది అవాస్తవమైతే చర్చకు ఇచ్చే సమాధానంలో ఆ విషయాన్ని ప్రస్తావించాలని అన్నారు. రుణమాఫీ అంశంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయడంతో కాంగ్రెస్ సభ్యులు ఎదురుదాడికి దిగారు. మీ హయాంలో ఏం చేశారని ప్రశ్నంచారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ తీరును వేముల ఎద్దేవా చేశారు. మేం ఏం చేశామనేది గతమని, మీరేం చేస్తున్నారో చెబుతుంటే మా మీద ఏడవడం దేనికని ప్రశ్నించారు. మీరు అధికారంలోకి వచ్చి 17 నెలలు పూర్తయ్యిందని, 17 నెలలుగా మా మీద ఏడుస్తూనే ఉన్నారని, ఇంకెన్నాళ్లు ఏడుస్తారని..? వ్యంగ్యంగా ప్రశ్నించారు.

# డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ మోసాలు.. నిందితుడి అరెస్టు



కరుణాకర్ మల్లిగారి,కరపత్రం ప్రతినిధి

డిజిటల్ అరెస్ట్ పేరుతో సైబర్ మోసాలకు పాల్పడుతున్న దుబాయ్‌కి చెందిన మహమ్మద్ జుబైర్ అహ్మద్‌ను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం నిందితుడు దుబాయ్ నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి రాగానే.. ముందస్తు సమాచారం మేరకు ఎయిర్‌పోర్టు అధికారులు అదుపులోకి తీసుకొని పోలీసులకు అప్పగించారు. హైదరాబాద్‌కి చెందిన ఓ వ్యక్తి నుంచి డిజిటల్ అరెస్ట్ పేరుతో రూ. 55 లక్షలు కాజేశాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సైబర్ క్రైం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇలా డిజిటల్ అరెస్టు పేరుతో కాజేసిన సొమ్మును వివిధ బ్యాంకు ఖాతాల ద్వారా దుబాయ్‌కి తరలించేవాడని దర్యాప్తులో తేలింది. గతంలో నిందితుడిపై పోలీసులు లుక్ అవుట్ నోటీసులు సైతం జారీ చేశారు. నిందితుడిపై దేశ వ్యాప్తంగా 124 కేసులు నమోదు కాగా.. రూ. కోట్లల్లో మోసాలకు పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైంది. తెలంగాణలో నిందితుడిపై 24 కేసులు నమోదయ్యాయి. కోర్టు ఉత్తర్వుల మేరకు నిందితుడిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

# మండుటెండలకు.. సహజ సిద్దమైన పానీయాలతో ఆరోగ్యానికి ఎంతోమేలు..

కరుణాకర్ మల్లిగారి,కరపత్రం ప్రతినిధి

మార్చి ఆరంభంలోనే ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 9 గంటలు అయ్యిందంటే ప్రజలు ఎండలను తట్టుకోలేక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. భానుడి ప్రతాపానికి బయటకు రావాలంటే ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ క్రమంలో ప్రకృతి సహజసిద్ధంగా లభించే కొన్ని రకాల పానీయాలు, ఆహార పదార్థాలు తీసుకోవటం ద్వారా ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుతుందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

ప్రకృతిలో సహజసిద్ధంగా లభించే కొబ్బరి బొండం, చెరకురసం, వివిధ రకాల పండ్ల రసాలు తీసుకోవటం ద్వారా ఆరోగ్యానికి ఎంతో ఉపశమనంగా ఉంటుందని చెబుతున్నారు. అందులో భాగంగానే నీటిశాతం ఎక్కువగా లభించే కీరదోసతో ఆరోగ్యానికి ఎన్నో లాభాలున్నందున ప్రజలు శీతలపానీయాలపై మొగ్గు చూపకుండా చెరకురసం, నిమ్మరసం, కొబ్బరిబోండాంతో పాటు ప్రకృతిలో సహజ సిద్ధంగా లభించే వాటిని తీసుకోవటం ఆరోగ్యానికి ఎంతో మేలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.



పోషకాల గని.. కొబ్బరి బోండాం..

ఎండాకాలంలో కొబ్బరిబోండాన్ని అమృత బాండంగా చెప్పుకోవచ్చు. కల్తీలేని కొబ్బరినీటిలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఎండాకాలంలో వేసవి తాపం నుంచి తక్షణ ఉపశమనం పొందాలన్న, అలసట నుంచి తక్షణ శక్తిని పొందాలన్న తప్పనిసరి కొబ్బరినీళ్లు తాగాల్సిందే. మనిషి, అనారోగ్యానికి గురైతే గ్లూకోజ్ ఎక్కిస్తారు. గ్లూకోజ్‌లో ఉండే పోషకాలకంటే అధికంగా కొబ్బరిబోండంలో లభిస్తాయని వైద్యులు చెబుతున్నారు. కొబ్బరి నీళ్లలో పోషక పదార్థాలతో పాటు మనిషి శరీరంలో రోగ నిరోదక శక్తి పెరుగుతుంది. రక్తాన్ని శుద్ధి చేసే గుణం కొబ్బరి నీళ్లలో ఉంటాయి. కడుపులో అప్పుడప్పుడు వచ్చే మంటలను తగ్గించడానికి టానిక్‌లా పనిచేస్తుంది. మనిషి శరీరంలో లవణాల శాతాన్ని పెంచడానికి కూడా ఈ నీళ్లు ఎంతో ఉపయోగపడుతాయి. కొబ్బరి బోండం కల్తీ చేయడానికి అవకాశంలేదు. కొబ్బరినీళ్లను ఎప్పుడైనా ఎవరైనా తాగవచ్చునని డాక్టర్లు సూచిస్తున్నారు. కొబ్బరిబోండంలో సోడియం, పొటాషియం, కాల్షియం, పాస్ఫరస్, ఐరన్, సల్ఫర్, క్లోరైడ్, ప్రోటీన్స్, ఇతర ఖనిజాలు పుష్కలంగానే ఉంటాయి. పాలలోని ప్రోటీన్ల కంటే అధికశాతం కొబ్బరి నీళ్లో ఎక్కువగా ఉంటాయని శరీరంలో లవణాలశాతం పడిపోయినప్పుడు కొబ్బరినీళ్లు తాగినప్పుడు లవణాల శాతం పెరిగే అవకాశం ఉంటుందని డాక్టర్లు సూచిస్తున్నారు. మూత్రపిండాల సమస్య ఉంటే కొంత మేరకు తగ్గించి శరీరానికి చల్లదనం ఇస్తుంది. మార్కెట్‌లో దొరికే వివిధ రసాయనలతో తయారు చేసిన చల్లని పానియాలకంటే వందరెట్లు ఆరోగ్యం పంచే కొబ్బరిబోండం మేలని అంటున్నారు.

దివ్యౌషధం.. చెరుకు రసం..



కల్తీలేకుండా స్వచ్ఛమైన పానీయాల్లో కొబ్బరిబోండం ఒకటికాగా, రెండోది చెరుకురసం. అనాధిగా వస్తున్న చెరుకు రసాన్ని అన్ని కాలాల్లో తయారుచేసి విక్రయిస్తుంటారు. ప్రధానంగా వేసవిలో దీని విక్రయాలు జోరుగా సాగుతుంటాయి. ప్రస్తుతం పల్లె, పట్టణం తేడాలేకుండా చెరుకు రసాన్ని విక్రయిస్తున్నారు. ధర అందుబాటులో ఉండి, ఆరోగ్యాన్ని ఇచ్చే చెరుకు రసంలో పోషకాలు పుష్కలంగాఉన్నాయని, మండుటెండల నుంచి ఉపశమనంపొందేందుకు చెరుకు రసం ఎంతో ఉపయోగపడుతుందని వైద్యాధికారులు అంటున్నారు. చెరుకురసం తీసుకోవడం ద్వారా జీర్ణక్రియ పెరగడంతో పాటు ఎలాంటి వ్యాదులు దరిచేరవని ప్రతి ఒక్కరుక్రమంగా చెరుకు రసాన్ని తీసుకోవాలి.

ఆరోగ్యధార.. కీర..

మనకు ఎల్లవేళల అందుబాటులో ఉంటూ..అతితక్కువ



ధరకు లభించే వాటిల్లో కీరదోస ఒకటి. ఇది వేసవితాపం నుంచి ఉపశమనం కలిగించడమే కాకుండా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. రోడ్లపక్కన, తోపుడు బండ్లపై లభించటంతో పాటు కూరగాల మార్కెట్‌లో కూడా కీర దోసకాయలు విరివిగా లభిస్తాయి. కీరదోసను భోజనంలో తీసుకోవడం ద్వార కూడాఎన్నో లాభాలున్నాయని వైద్యాధికారులు తెలియజేస్తున్నారు. కీరదోసతో ఎండ నుండి ఉపశమనం కలిగిస్తుందని కీరను తీసుకోవడం ద్వారా కొన్ని వ్యాదులు దరిచేరవని వైద్యాధికారులుంటున్నారు. కీరదోసతో ఉపయోగాలు ఎన్నో ఉన్నాయి.

# మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో షేక్ ఇమామ్, అభిషేక్ జన్మదిన వేడుకలు

కరపత్రం ఖమ్మం మార్చి 15:

తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఖమ్మం క్యాంపు కార్యాలయంలో టెలికాం అడ్వైజరీ కమిటీ మెంబర్ షేక్ ఇమామ్, కరాటే వేణు కుమారుడు అభిషేక్ జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్




రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జన్మదినం జరుపుకుంటున్న వారిద్దరికి శుభాకాంక్షలు తెలిపి కేక్ కట్ చేయించారు. ఖమ్మం నగరంతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన నాయకులు ఈ వేడుకల్లో పాల్గొని ఇమామ్, అభిషేక్ కు జన్మదిన వేడుకలను తెలిపారు. నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని ఆకాంక్షించారు.

# బర్త్డే విషెస్ తెలిపిన మిత్ర బృందం

కరపత్రం హనుమకొండ మార్చి 15

ఈరోజు హనుమకొండ గుండ్ల సింగారంలో బోడ బాలమణి రాజేందర్ నాయక్ పుట్టినరోజు ఘనంగా జరిగింది. తన మిత్రులు కేక్ కట్ చేసి శాలువా బొకేలతో శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకన్న నాయక్ జర్నలిస్ట్ లావుడియా రాజు నాయక్. బిల్డర్ రాజు నాయక్. జర్నలిస్టు భూక్య మోహన్. సుమన్. రవీందర్. బాదావత్ విజయ్. భూక్య కళ్యాణ్. బానోత్ జీవన్. ఆంగోత్ రవి. తదితరులు పాల్గొన్నారు



# కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో తాగునీటికి తప్పని ఇబ్బందులు



కరుణాకర్ మల్లిగారి,కరపత్రం ప్రతినిధి

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో ఇంకా ఎండలు ముదరక ముందే తాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదు. ప్రధానంగా మురికివాడలు, బస్తీలలో ఈ సమస్య అధికంగా వేధిస్తున్నది. అసలే నాలుగైదు రోజులకు ఒకసారి తాగునీటి సరఫరా అవుతుండగా, అది లో ప్రెషర్‌తో వస్తుండడంతో ప్రజలు నీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొక తప్పడం లేదు.

నియోజకవర్గ పరిధిలోని కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్లతోపాటు కొంపల్లి, దుండిగల్ మున్సిపాలిటీలు, నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు కాలనీలు, బస్తీలలో తాగునీటి ఎద్దడి అప్పుడే మొదలైంది. గతంలో రోజు విడిచి రోజు వచ్చే తాగునీరు ప్రస్తుతం నాలుగైదు రోజులకు ఒకసారి వస్తుందనీ, అది కూడా అర కొరగానే వస్తుండడంతో ప్రజలు ట్యాంకర్ ల వైపు చూస్తున్నారు. కొన్నిచోట్ల గంటల కొద్ది సమయం తీసుకుంటున్న జలమండలి వాటర్ ట్యాంకర్లు, మరికొన్ని ప్రాంతాలలో మాత్రం 24 గంటల వరకు సరఫరా చేయలేని పరిస్థితి నెలకొందని ప్రజలు పేర్కొంటున్నారు. అదే సమయంలో ప్రైవేట్ ట్యాంకర్ల నిర్వాహకులు సైతం ఇష్టారాజ్యంగా డబ్బులు వసూలు చేస్తూ అందరకాడికి దండుకుంటున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి తాగునీటి సరఫరాను మెరుగు పరచాలని కోరుతున్నారు.

# పోలీస్ జాగిలం హంటర్ మృతి.. నివాళి అర్పించిన ఎస్పీ జానకి షర్మిల



తిప్పిరి గంగాధర్,కరపత్రం ప్రతినిధి

నిర్మల్ జిల్లాలో పోలీస్ శాఖకు విశేష సేవలందించిన హంటర్ అనే జాగిలం అనారోగ్యంతో గురువారం మృతి చెందింది. చాలా ఏళ్లుగా హంటర్ పలు కేసుల్లో కీలక పాత్ర పోషించిందని ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో దాని భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి, నివాళి అర్పించారు. పోలీసు అధికారులు, సిబ్బంది రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఎస్పీ మాట్లాడుతూ.. బెల్జియం మలినోస్ జాతికి చెందిన హంటర్ మార్చి11, 2021న జన్మించిందని, రంగారెడ్డి జిల్లాలోని కెనైన్ ట్రైనింగ్ సెంటర్ ఐఐటీఏ మొయినాబాద్‌లో 8 నెలల శిక్షణ పూర్తి చేసుకుందని తెలిపారు.నిర్మల్ జిల్లాలో ఫిబ్రవరి, 2022 నుంచి విధుల్లో చేరిందన్నారు. పలు జాతీయ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లలో పాల్గొని, ప్రతిభ చాటిందని పేర్కొన్నారు. పోలీస్? లాంఛనాలతో అంత్యక్రియలు జరిపారు. అడిషనల్ ఎస్పీ రాజేశ్?మీనా, ఇన్?స్పెక్టర్లు ప్రేమ్ కుమార్, కృష్ణ, ఆర్ఐలు రామ్?నిరంజన్, శేఖర్, రమేశ్, ఎస్ఐ లింబాద్రి, ఆర్ఎస్ఐలు, జాగిలంల సంరక్షకులు, పో లీస్ సిబ్బంది పాల్గొన్నారు

# ఆదిలాబాద్ లో ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తాం : ఎస్పీ అఖిల్ మహాజన్




తిప్పిరి గంగాధర్,కరపత్రం ప్రతినిధి

ఆదిలాబాద్ పట్టణంలో ట్రాఫిక్ సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ప్రధాన కూడళ్లను పరిశీలించారు. వినాయక, అబ్దుల్లా, గాంధీ, అంబేడ్కర్, శివాజీ చౌక్లలో ట్రాఫిక్ సమస్య తీవ్రతను తెలుసుకున్నారు. ప్రమాదాలు చోటు చేసుకోకుండా నిత్యం డ్రంకెన్?డ్రైవ్ టెస్ట్ లు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీలు జీవన్ రెడ్డి, శ్రీనివాస్, పట్టణ సీఐ సునీల్తదితరుల పాల్గొన్నారు.

# జగదాంబ, సేవలాల్ ఆలయ వార్షికోత్సవ ఉత్సవాలను విజయవంతం చేయాలి... బధ్యానాయక్ రాథోడ్

కరపత్రం బాన్సువాడ మార్చి 15

గాంధారి మండలంలోని వెంకటాపూర్ గ్రామ శివారులో గల జగదాంబ దేవి సేవాలాల్ మహారాజ్ ఆలయ 23వ వార్షికోత్సవ ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం శక్తిపీఠ్ జాతీయ ప్రధాన కార్యదర్శి, జిల్లా అధ్యక్షులు బధ్యానాయక్ రాథోడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంజరుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్, జగదంబ ఆలయాలను నిర్మించి 23 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా, జిల్లాలోని బంజరులు, భక్తులు మహిళలు అధిక సంఖ్యలో హాజరై పౌరదేవి పీఠాధిపతి బాబు సింగ్ మహారాజ్ ఆశీర్వచనాలు పొందాలన్నారు.

## నిజాంసాగర్ ప్రధాన కాలువలో పడి యువకుడి గల్లంతు



**కరపత్రం బాన్సువాడ మార్చి 15**
బాన్సువాడ మండలంలోని కృష్ణ నగర్ తండా సమీపంలోని నిజాంసాగర్ ప్రధాన కాలువలో హన్మజీపేట్ గ్రామా పంచాయతీ పరిధిలోని సంగ్రామ్ నాయక్ తండ గ్రామానికి చెందిన సిద్ధార్థ, రాజేష్ శనివారం పని నిమిత్తం బాన్సువాడకు వచ్చి తిరుగు ప్రయాణంలో కాలకృత్యాలు తీర్చుకొని కాల్వలో కాళ్లు చేతులు కడుక్కునేందుకు వెళ్లగా ప్రమాదవశాత్తు సిద్ధార్థ, రాజేష్ ప్రధాన కాలువలో కొట్టుకుపోతుండగా స్థానికులు గమనించి రాజేష్ ను కాపాడినప్పటికీ సిద్ధార్థ యువకుడు కాలువలో గల్లంతయ్యారు. సంఘటన స్థలికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## సాలంపాడ్ లో కుస్తీ పోటీలు...



**సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి**
బోధన్ నియోజకవర్గం సాలూర మండలంలోని సాలంపాడ్ గ్రామంలో కుస్తీ పోటీలు నిర్వహించారు. హోళీ పండుగ పురస్కరించుకొని శనివారం సాలంపాడ్ గ్రామంలో గ్రామానికి చెందిన బస్వంత్ రావు పటేల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కుస్తీ పోటీలలో పెద్ద ఎత్తున మల్ల యోధులు పోటీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోటీలలో గెలుపొందిన విజేతలకు బస్వంత్ రావు పటేల్ చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేసి ఘనంగా సత్కరించారు.

## టాస్కోర్స్ మెరుపు దాడులు...



**సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి**
బోధన్ పట్టణంలోని మూడు పి.డి.ఎస్. రైస్ గోదాంలపై టాస్క్ ఫోర్స్ సిబ్బంది ముమ్మరంగా దాడులు నిర్వహించారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ ఇంచార్జ్ ఏసీపీ నాగేంద్ర చారి ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ అంజయ్య, స్పెషల్ పార్టీ సిబ్బందితో కలిసి శనివారం బోధన్ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని 3 పిడిఎస్ రైస్ గోదాంలపై దాడులు చేపట్టారు. చేపట్టిన దాడులలో సుమారు 2,80,000 రూపాయల విలువ గల 8 టన్నుల పిడిఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ముగ్గురు గోదాం నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నట్లు పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు.

## సస్పెన్షన్ ను ఎత్తివేయాలి... బీఆర్ఎస్ నాయకులు..



**సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి**
మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి ని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడం సరికాదని బోధన్ పట్టణ బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి సస్పెన్షన్ ను ఖండిస్తూ శనివారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో గల రాజ్యాంగ నిర్మాత డా. బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి మోమోరండం అందించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై గొంతెత్తుతూ, ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపితే సభ నుంచి బహిష్కరిస్తారా అని ప్రశ్నించారు. ప్రజా సమస్యలను శాసనసభలో కూడా లేవనెత్తనివ్వరా అని అడిగారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చ జరగకుండా ప్రజల దృష్టి మళ్లించడానికే జగదీశ్ రెడ్డి ని సస్పెండ్ చేసినట్లు స్పష్టమవుతోందన్నారు. తక్షణమే జగదీశ్ రెడ్డి పై ఉన్న సస్పెన్షన్ ను ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలన చూస్తుంటే రజాకార్ల పాలన గుర్తుకు వస్తుందని అన్నారు. ఇకనైనా సస్పెండ్ ఎత్తివేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నక్క లింగారెడ్డి, బెంజర్ గంగారాం, రవిశంకర్ గౌడ్, శంకర్ గౌడ్, ప్రవీణ్ నాయక్, అహమ్మద్, సాగర్, నసీర్ పటేల్, సాయిలు, ఇంతియాజ్ పటేల్, సుధాకర్, ఆశీమ్, మహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

# మాలలకు ఉద్యోగాలు..మాదిగలకు నిరసనలా

**సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి**
ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని అమలు చేయకుండా ఉద్యోగ నియామకాలు చేపడుతున్న రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ చేపట్టిన ఎమ్మార్పీఎస్ నిరసన దీక్షలు నాలుగో రోజుకు చేరాయి.వీహెచ్ పీఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వికలాంగుల హక్కుల పోరాట సమితి(వీహెచ్ పీఎస్) జిల్లా కమిటీ నాయకులు సంఘీభావం తెలిపి నిరసనలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కనక ప్రమోద్ మాదిగ మాట్లాడుతూ,తెలంగాణలో సమస్త ప్రజలు కులాలు హోలీ పండుగ సంబరాల్లో ఉంటే మాదిగ జాతి మాత్రమే తమ హక్కుల కోసం నిరసనలు,ఉద్యమాలు చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి కారణం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని అన్నారు. ఒకవైపు



మాలలు ఉద్యోగాలు సాధిస్తూ పండగ జరుపుకుంటుంటే,మరోవైపు మాదిగలు అవే ఉద్యోగాల కోసం నిరసనలు తెలుపుతున్నారని, మాలల ఒత్తిడికి తలొగ్గి మాదిగలకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే మాదిగలు కోరుకునే ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టాన్ని అసెంబ్లీలో బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. బిల్లు పెట్టకుండా తాత్సారం చేస్తే మాదిగల సత్తా ఏంటో ప్రభుత్వానికి చూపెడుతామని హెచ్చరిస్తున్నామన్నారు. ఎమ్మార్పీఎస్ దీక్షకు జర్నలిస్టులు రామకృష్ణ,దశరథ్ సంఘీభావం తెలిపారు. దీక్షలో ఎమ్మార్పీఎస్,జిల్లా ఉపాధ్యక్షుడు రొడ్డ ప్రవీణ్ మాదిగ,ఎంఎంఎస్,జాతీయ నాయకురాలు సత్తెక్క,జిల్లా నాయకురాలు స్వప్న మాదిగ,ఎమ్మార్పీఎస్ టౌన్ అధ్యక్షుడు మహేశ్ మాదిగ, వీహెచ్ పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు సలీం,జిల్లా మహిళా అధ్యక్షురాలు కృష్ణవేణి,నాయకులు ప్రశాంత్,పోతన్న తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ద్వారా కోర్సులను భోదించాలి...

**– డిఈఓ అశోక్ కుమార్..**

**సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి**
నిజామాబాద్ జిల్లాలో 44 ప్రాథమిక పాఠశాలలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ద్వారా కోర్సులను భోదించాలని జిల్లా విద్యాధికారి అశోక్ కుమార్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిజామాబాద్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు అర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ కోర్సును బోధించాలని నిర్ణయించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ కుమార్ తెలిపారు. జిల్లాలోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు ఒకే ప్రాంగణంలో ఉండి కంప్యూటర్లు అందుబాటులో గల పాఠశాలలో ప్రయోగాత్మకంగా ఎంపిక చేయడం జరిగిందన్నారు. శనివారం నుంచి కోర్సు బోధనను ప్రారంభించడం



జరిగిందని తెలిపారు. ఈ మేరకు ఇప్పటికే ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ప్రయోగాత్మక నిర్ణయం ద్వారా విద్యార్థుల బుద్ధి వికాసాన్ని పెంపొందించడంతో పాటు, వారి నైపుణ్యాలను మెరుగుపరిచే అవకాశాలు లభిస్తాయని,ఆధునిక సాంకేతికతను ఉపయోగించి విద్యను మరింత ప్రభావవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా బోధన్



పట్టణంలోని ప్రభుత్వ మధుమలంచ ప్రాథమిక పాఠశాలలో జిల్లా విద్యాధికారి అశోక్ కుమార్, మండల విద్యాధికారి నాగయ్య చేతుల మీదుగా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ కోర్సును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఆరిఫ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేందర్, సాయికిరణ్, ఉపాధ్యాయులు ప్రీతి, శివతేజ, సాగర్, శ్రీకాంత్ సిఆర్పి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# వినియోగదారుల హక్కుల పరిరక్షణకు పాటుపడాలి

**– అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్...**

**సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి**
వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం సంబంధిత శాఖల అధికారులు అంకిత భావంతో కృషి చేయాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ సూచించారు.ప్రపంచ వినియోగదారుల హక్కుల పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో పౌర సరఫరాల శాఖ, సివిల్ సప్లైస్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.వినియోగదారుల హక్కులు, బాధ్యతలను తెలియజేస్తూ,చట్ట పరిధిలో ఎలాంటి సేవలు పొందవచ్చు,వస్తు,సేవలలో మోసాలు ఎదురైనప్పుడు ఎవరికి ఫిర్యాదు చేయాలి.తదితర అంశాలపై వినియోగదారులను చైతన్యపర్చే కార్యక్రమాలు నిర్వహించాలని వినియోగదారుల సంఘాలకు సూచించారు.వస్తువుల నాణ్యత,వాటి ప్రమాణాల




గుర్తింపు తదితర అంశాలపై వినియోగదారులకు అవగాహన ఉన్నప్పుడే,నాసిరకం,నాణ్యతా లోపాలను గుర్తించి తమ హక్కుల కోసం ఫిర్యాధు చేయగల్గుతారని అన్నారు.వినియోగదారుడు తన హక్కులు,బాధ్యతలను తెలుసుకున్నప్పుడే నాణ్యమైన వస్తువులు, సంతృప్తికర సేవలు పొందేందుకు ఆస్కారం ఉంటుందన్నారు.ఒకవేళ ఏదైనా సందర్భంలో మోసాలకు గురైతే న్యాయం పొందేందుకు వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టాలు దోహదపడతాయని అన్నారు.దీనిని దృష్టిలో పెట్టుకుని ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు వినియోగదారులకు



వారి హక్కులు,బాధ్యతల పట్ల అవగాహన పెంపొందించేందుకు కృషి చేయాలని హితవు పలికారు.నేటి రోజుల్లో అందుబాటులోకి వచ్చిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో నాణ్యమైన వస్తువులు,సేవలను గుర్తించేందుకు గల అవకాశాలను తెలియజేయాలన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు,వినియోగదారుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పోలీస్ కమిషనర్ ని కలిసిన అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్

**కరపత్రం ఇందూర్ నగరం, మార్చ్ 15 :**
నిజామాబాద్ జిల్లా పోలీస్ కమిషనర్ గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన పోతరాజు సాయి చైతన్యను శనివారం రోజున ఆయన కార్యాలయంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్త మర్యాదపూర్వకంగా కలుసుకొని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ మాట్లాడుతూ,నిజామాబాదు జిల్లాలో శాంతి భద్రతలు అదుపు చేయడంలో కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లావ్యాప్తంగా జరుగుతున్న డ్రగ్స్,గంజాయి,మారకద్రవ్యలపైన ఉక్కు పాదం మోపి యువతను వాటి బారిన పడకుండా రక్షించాలని అన్నారు.మారకద్రవ్యల పైన పోలీస్ శాఖ వారు కళాశాల విద్యార్థుల్లో అవగాహన కార్యక్రమాలు




చేపట్టాలని సూచించారు.నగరంలో వరుస దొంగతనాలు చైన్ స్నాచింగ్,ఆటో,బైక్ దొంగతనాలు అరికట్టి ప్రజలకు రక్షణగా నిలవాలన్నారు.నగరంలో ట్రాఫిక్ సమస్య,ఫుట్ పాత్ కబ్జాలు,అక్రమ భూ కబ్జాలపై ప్రతేక ద్రుష్టి పెట్టాలని,కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోని సామాన్య ప్రజలకు అండగా నిలవాలని అన్నారు.జిల్లా అభివృద్ధి,లా అండ్ ఆర్డర్ కాపాడటంలో పోలీస్ శాఖ వారు తీసుకునే ప్రతి అంశంలో ఎమ్మెల్యేగా తన మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని తెలియజేశారు.ఎమ్మెల్యే ధన్ పాల్ చేసిన సూచనలకు సానుకూలంగా స్పందించిన సిపి పోతరాజు సాయి చైతన్య శాంతిభద్రతలను కాపాడుతూ ప్రజలకు శాంతియుత వాతావరణాన్ని అందించడానికి తప్పకుండా తగిన చర్యలు తీసుకుంటూ,అవసరమైతే మీ సహకారాన్ని కూడా తీసుకుంటామని ఎమ్మెల్యేతో అన్నారు.

## కొనసాగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలు

**– 364 మంది విద్యార్థుల గైర్హాజర్...**
**– తొమ్మిది మంది విద్యార్డుల పై మాల్ ప్రాక్టీస్ కేసు...**

**సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి**
ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం జువాలజీ,హిస్టరీ,మ్యాథ్స్-2బి పరీక్ష పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయి.జిల్లాలో మొత్తం 14,472 మంది విద్యార్థులకు గాను 14,108 విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని 364 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారన్నారు.మొత్తం 97.5 శాతం విద్యార్థులు పరీక్షలు రాయగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు నిర్వహించామని తెలియజేశారు.శనివారం పలు కళాశాలల్లో చీటీలు రాస్తూ కాపీయింగ్ చేస్తున్న తొమ్మిది మంది విద్యార్థుల పై మాల్ ప్రాక్టీసు కేసు నమోదు చేశామని జిల్లా ఇంటర్ విద్య అధికారి తిరుమలపుడి రవికుమార్ తెలిపారు.బోధన్ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో ఏడుగురు విద్యార్థులు,నందిపేట్ మోడల్ జూనియర్ కళాశాలలో ఇద్దరు



విద్యార్థులు చీటీలు రాస్తుండగా ఫ్లయింగ్ స్క్వాడ్ లు పట్టుకుని మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు చేశారని జిల్లా ఇంటర్ విద్య అధికారి తెలిపారు.జిల్లాలో మొత్తం 57 పరీక్ష కేంద్రాలకు గాను 51 పరీక్ష కేంద్రాలను తనిఖీలు చేశారు.